క్లుప్తంగా

ఆలయ గడప ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న నర్సింహరెడ్డి దంపతులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని అనంతారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మతల్లి దేవాలయ గడపను ఆదివారం ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గడప దాతలు గుమ్మడిదల మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి పండితుల వేదమంత్రాల మధ్య ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి పాల్గొని ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

మా కూతురు వివాహానికి రండి



దత్తాత్రేయకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న నిర్మలారెడ్డి

సంగారెడ్డి: సంగారెడ్డిలో ఈ నెల 7న జరిగే తమ కూతురు వివాహానికి హాజరుకావాలని బండారు దత్తాత్రేయకు టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి కూతురితో కలిసి ఆహ్వాన పత్రికను ఆదివారం హైదరాబాద్‌లో అందించారు.

క్రీడాపోటీలు



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న శ్యామ్‌రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధి ఉస్మాన్‌నగర్ బిమ్యాక్ సైబర్ కాలనీలో ఆదివారం నిర్వహించిన వాలీబాల్ క్రీడాపోటీలను డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్‌రావు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు ఆడటం వలన ఆరోగ్యం ఉంటామన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం వారికి నచ్చిన క్రీడను ఒక గంట ఆడాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

మైనొద్దిన్ ఖురేషి నియామకం

నారాయణఖేడ్: నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ సంస్థ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎం.డీ. మైనొద్దిన్ ఖురేషి నియమితులయ్యారు. ఆదివారం ఖేడ్‌లోని సంస్థ ప్రాంతీయ కార్యాలయంలో ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు బైండ్లకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రహీం ఉత్తర్వులు జారీచేశారు. మైనొద్దిన్ ఖురేషి పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుండగా మరిన్ని సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆయనను నియమించినట్లు వివరించారు. సంస్థ జిల్లా చైర్మన్ రాజ్‌కుమార్, న్యాల్‌కల్ అధ్యక్షుడు నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన శ్రీనివాస్‌గౌడ్

పటాన్‌చెరు: గోవాలోని శ్యాంప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో ఈనెల 7న జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న అఖిల భారత జాతీయ ఓబీసీ 10వ మహాసభ వాల్ పోస్టర్‌ను నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓబీసీల హక్కుల పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు అవగాహన కలిగించే వేదికలుగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజశేఖర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నదానం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు టోల్‌గేట్ సమీపంలోని శ్రీ రామలింగేశ్వర దేవస్థానంలో శ్రావణ సోమవారం పురస్కరించుకొని స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు మహేశ్, గణేశ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సోమవారం ఉ. 5:00 నుంచి 7:00 వరకు పార్వతీ రామలింగేశ్వర స్వామివారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అదే విధంగా మధ్యాహ్నం అన్నదానం చేశారు.

కనులార చూడు.. గిజిగాడి గూడు

పిచ్చుకలు కట్టే గూడు ఎంతో నేర్పరితనం కలిగి ఉంటుంది. వేలాడేలా కట్టుకోవడం వీటి అద్భుత తెలివికి నిదర్శనం. గూడ్లు, పిల్లలను శత్రువుల బారి నుంచి కాపాడు కునేందుకు నైపుణ్యాన్ని ప్రదర్శించి గూళ్లను నిర్మించుకుంటాయి. వేలాడే గూళ్లు చూపరులను అబ్బురపరుస్తుంటాయి. బావుల్లో వంగిన చెట్ల కొమ్మలు, విద్యుత్ తీగలకు తాటి, తుమ్మ, ఈత చెట్లకు ఎక్కువగా గూళ్లను కట్టుకుంటాయి. వర్షాకాలం వచ్చేసిందంటే చాలు పక్షులు గూళ్లు కట్టడం ప్రారంభిస్తాయి. సీజన్ ప్రారంభంతోనే పక్షులు గూళ్లు కట్టడం ప్రారంభించాయి. జహీరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో పంట పొలాల్లోని చెట్లకు చక్కని ప్రతిభతో గూళ్లను కట్టుకోవడం కనిపించింది.

– జహీరాబాద్ టౌన్:





చెట్ల కొమ్మలకు పిచ్చుకలు కట్టుకున్న గూళ్లు

అధ్వానంగా రహదారులు

- గుంతలమయంగా జిల్లాలోని రోడ్లు
- మరమ్మతులు చేపట్టని అధికారులు
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు

సంగారెడ్డి క్రైమ్: పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ ధ్వంసమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఎస్వీ జూనియర్ కాలేజీకి వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. తారు లేచిపోయి గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. విద్యార్థులు, స్థానికులు ప్రమాదాల బారిన పడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. కొన్ని చోట్ల తారు పూర్తిగా లేచిపోయి ఇనుప రాడ్లు కనిపిస్తున్నాయి. పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే కూడళ్ల వద్ద పరిస్థితి మరి దారుణంగా ఉంది. అలాగే కొత్త బస్టాండ్ నుంచి కల్వకుంటకు వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్లు మరి అధ్వానంగా మారాయని విద్యార్థులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ప్రధాన రహదారులకు మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

రోడ్డు మధ్యలో గుంతలు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని పలు రోడ్లు దారుణంగా తయారయ్యాయి. రోడ్ల మధ్యలో గుంతలు పడి ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. పట్టణంలోని పస్తాపూర్ చౌరస్తా నుంచి ఝరాసంగానికి వెళ్లే రోడ్డు మధ్యలో పెద్ద గుంతలు పడ్డాయి. నిత్యం రద్దీగా ఉండే రోడ్డు మధ్యలో పడిన గుంతల కారణంగా దగ్గరకు వచ్చే వరకు వాహనదారులు గమనించడంలేదు. వాహనవేగం నియంత్రణ కోల్పోవడంతో ప్రమాదాల బారిన పడి గాయాల పాలవుతున్నారు. గుంతలమయంగా మారిన రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు కూడా నిర్వహించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి పస్తాపూర్ చౌరస్తా సమీపంలో రోడ్డుపై గుంతలను పూడ్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



తారుపోయి ఇనుప చువ్వలు కనిపిస్తున్న రోడ్డు



పస్తాపూర్ చౌరస్తా వద్ద రోడ్డు మధ్యలో గుంతలు

అధ్వానంగా మిర్జాపూర్(ఎన్)–న్యాల్‌కల్ రోడ్డు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలం పరిధి మిర్జాపూర్(ఎన్)–న్యాల్‌కల్ రోడ్డు అధ్వానంగా తయారైంది. దశాబ్దాల క్రితం వేసిన రోడ్డుపై చాలా ప్రాంతాల్లో బీటీ లేచిపోయి గుంతలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల గుంతల్లో నీరు నిలబడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గుంతలకు తోడు రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు రోడ్డుపై ఒరగడంతో ఇరుకుగా మారింది. దీంతో రోడ్డు గుండా రాకపోకలు సాగించే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్గమధ్యలోని బ్రిడ్జిపై నీరు నిల్వడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని రోడ్డును బాగు చేయించాలని వేడుకుంటున్నారు.



మిర్జాపూర్(ఎన్)–న్యాల్‌కల్ రోడ్డుపైకి వాలిన ముళ్లపొదలు



బ్రిడ్జిపై నిలిచిన వర్షం నీరు

ప్రజా సమస్యలపై బస్తీబాట

జహీరాబాద్ టౌన్: ప్రజా సమస్యలపై పట్టణంలో బస్తీబాట నిర్వహిస్తున్నట్లు సీపీఎం జహీరాబాద్ డివిజన్ నాయకులు మహిపాల్ అన్నారు. పట్టణంలోని శ్రామిక్ భవనంలో ఆదివారం ఆయన మాట్లాడారు. సోమవారం నుంచి పట్టణంలోని అన్నీ బస్తీలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటామని చెప్పారు. పట్టణంలో ఎక్కడ చూసినా సమస్యలు దర్శనమిస్తున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జహీరాబాద్‌కు వచ్చినా పట్టణాభివృద్ధికి ఎలాంటి నిధులు విడుదల చేయలేదన్నారు. రోడ్లు, మురికి కాలువలు, వీధి దీపాలు, పెన్షన్ల సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. సమస్యలను తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సమావేశంలో నాయకులు సలీమొద్దీన్, బాలరాజ్, నరేష్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహిపాల్

పాదయాత్రగా కేతకీకి తరలిన భక్తులు



పాదయాత్రగా ఆలయానికి తరలిన భక్తులు

న్యాల్‌కల్(జహీరాబాద్): కర్నాటక, మహారాష్ట్రకు చెందిన భక్తులు ఆదివారం భజనలు చేసుకుంటూ పాదయాత్రగా మండల కేంద్రం ఝరాసంగంలోని కేతకీ ఆలయానికి తరలివెళ్లారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండి, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ 600 మంది భక్తులు బయలుదేరారు. ఆదివారం న్యాల్‌కల్ మండలంలోని మల్గి, డప్పూర్, అత్నూర్, న్యాల్‌కల్, రుక్మాపూర్‌ల మీదుగా ఝరాసంగంలోని కేతకి సంగమేశ్వర ఆలయానికి పాదయాత్రను కొనసాగించారు. ఆదివారం రాత్రికి ఆలయానికి చేరుకొని స్వామి వారికి ఇష్ట దినమైన సోమవారం అమృత గుండంలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటామని చెప్పారు. పాదయాత్రన తరలిన భక్తులకు అత్నూర్ గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు.

బీజేపీతోనే గ్రామీణ వికాసం సాధ్యం

నారాయణఖేడ్: గ్రామీణ ప్రాంతాల వికాసం బీజేపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఖేడ్‌లో బీజేపీ మహా సంపర్క్ అభియాన్ కరపత్రాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపట్టారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తుందని ఆరోపించారు. కేంద్రం గ్రామ పంచాయతీలకు సైతం సకాలంలో నిధులను విడుదల చేస్తుందని, ఉజ్వల యోజన ద్వారా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు దశరథ్, నాయకులు జ్ఞానేశ్వర్, సుగుణాకర్ ఉన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిసున్న నాయకులు

రేషన్ కార్డు మంజూరు పత్రాల పంపిణీ



మంజూరు పత్రాలను అందజేస్తున్న శంకర్

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పేట్ 3, 4 వార్డుల్లో కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులకు సంబంధించిన మంజూరు ప్రతాలను ఆదివారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్ లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. ప్రజా ప్రభుత్వం పార్టీలకు అతీతంగా రేషన్ కార్డులు మంజూరు చేసిందన్నారు. నాయకులు నర్సింహులు, రాములు, మహేశ్, వీరేశం, ఏక్‌నాథ్ పాల్గొన్నారు.

వర్షం మాటున వ్యర్థజలాలు విడుదల

జిన్నారం (పటాన్‌చెరు): పంటపొలాల్లోకి రసాయన వ్యర్థజలాలు విడుదల చేయడాన్ని ప్రశ్నించిన గ్రామస్తులపై పరిశ్రమ ప్రతినిధులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని గడ్డపోతారం రైతులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో శనివారం పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. గత రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలను అదునుగా తీసుకొని ఎంఎస్ఎన్ పరిశ్రమ యథేచ్ఛగా వ్యర్థజలాలను విడుదల చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమలో నిర్మించిన భారీ కాలువల ద్వారా వర్షం నీటితో కలిపి బహిరంగ ప్రదేశాల్లోకి వదిలేస్తున్నారని ఆ జలాలు పక్కనే ఉన్న పంటపొలాల్లోకి చేరుతున్నాయని తెలిపారు. ఇదే విషయంపై గ్రామస్తులు, రైతులు పరిశ్రమ వద్దకు వెళ్లి ప్రశ్నించగా దురుసుగా ప్రవర్తిస్తూ పరిశ్రమ వద్దకు వస్తే కేసులు పెడతామని, అధికారులంతా మా వైపే ఉన్నారని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అధికారులకు వివరించారు. గత సంవత్సరం వ్యర్థజలాలు సేవించి 20కి పైగా గేదెలు మృతి చెందాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరిగిన పరిశ్రమ తీరు మారకపోవడం సరికాదన్నారు. ఇప్పటికే నిత్యం విషవాయువులు, వ్యర్థజలాలతో సతమతమతున్నా.. పంటపొలాల్లో కూడా అదే పరిస్థితి నెలకొందని వాపోయారు. వ్యర్థలను విడుదల చేస్తున్న ఎంఎస్ఎన్ పరిశ్రమపై కఠిన చర్యలు తీసుకోవాలని పీసీబీ ఈఈ కుమార్ పాఠక్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్జున్, చిరంజీవి, నవీన్, ఉపేందర్ పాల్గొన్నారు.



పీసీబీ అధికారికి ఫిర్యాదు చేస్తున్న రైతులు

శ్రావణమాస పూజలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ వీరన్నగూడెం పరిధిలోని వీరభద్ర స్వామి ఆలయంలో శ్రావణమాస పూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాదయాత్రగా ఆలయానికి చేరుకొని లక్షపత్రి, రుద్రాభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. వచ్చిన భక్తులందరికీ అన్నదాన వితరణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఈఓ శశిధర్ గుప్తా, ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి తెలిపారు.

లింగాయత్‌లను బీసీలోకి మార్చింది కాంగ్రెస్సే



పాదయాత్రలో పాల్గొన్న నీలం మధు

కాంగ్రెస్ నేత నీలం మధు

పటాన్‌చెరు టౌన్: లింగాయత్‌లను బీసీలోకి మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో విశ్వశాంతి కోసం పటాన్‌చెరు ఉమామహేశ్వర దేవాలయం నుంచి బొంతపల్లి వీరభద్రస్వామి దేవాలయానికి నిర్వహిస్తున్న పాదయాత్రకు హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వశాంతికి వీరశైవ లింగాయత్‌లు గత 18 సంవత్సరాలుగా పాదయాత్రను చేపట్టడం అభినందనీయమన్నారు. సమాజంలో కుల, వర్గ, లింగ వివక్షతను వ్యతిరేకించి సమ సమాజం కోసం పోరాడిన అభ్యుదయవాది మహాత్మా బసవేశ్వరని అన్నారు. ఆయన అడుగుజాడలలో నడుస్తూ వీరశైవ లింగాయత్‌లు సమసమాజ స్థాపనకు కృషి చేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో లింగాయత్‌ల అభ్యున్నతికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లింగాయత్ సమాజ్ నాయకులు, పటాన్‌చెరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నరసింహారెడ్డి రెడ్డి, నాయకులు జలిగారి ఎట్టయ్య, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రోటోకాల్ చైర్మన్ పట్లోళ్ల ఆదిత్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణమాస బోనాలు

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారంలో శ్రావణమాస బోనాల పండుగను ఆదివారం గ్రామస్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. మంటికుండలకు బొట్లు, వేపకొమ్మలతో అలంకరించి బోనాన్ని పూజించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా మహిళలు బోనమెత్తారు. డప్పుల దరువుల మధ్య పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకలు మధ్య అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



బోనాల ఉత్సవాల్లో గ్రామస్తులు

భారతినగర్ డివిజన్ పరిధిలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీలో ఆదివారం జరిగిన ఎల్లమ్మ, పోచమ్మ బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.



రామచంద్రాపురం: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే



రామచంద్రాపురం: బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న భూపాల్ రెడ్డి

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన

జహీరాబాద్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో పోచమ్మ, బాలమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు మూడు రోజులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి అవధూతగిరి మహరాజ్, ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహరాజ్, మల్లన్నగట్టు పీఠాధిపతి బసవలింగ మహరాజ్ పలువురు పీఠాధిపతులు పాల్గొని పూజలు చేశారు. ఉత్సవాలలో భాగంగా భక్తులు ఇంటింటి నుంచి బోనాలు తీసి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం దర్శించుకున్నారు. కార్యక్రమంలో హౌసింగ్‌బోర్డు, నారాయణనగర్, శాంతినగర్ కాలనీలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.



జహీరాబాద్: బోనాలు తీస్తున్న భక్తులు



జహీరాబాద్: బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు

వంటపాత్రల వితరణ

నారాయణఖేడ్: పట్టణ శివారులోని వెంకటాపూర్ చౌరస్తా సమీపంలోని మార్కండేయస్వామి ఆలయానికి కరీంనగర్ జిల్లా కొడిమ్యాలకు చెందిన సామల శ్రీనివాస్, సునీత దంపతులు వంటపాత్రలు, సామగ్రిని వితరణ చేశారు. ఆదివారం ఆలయ అభివృద్ధి కమిటీ బాధ్యులకు వాటిని అందజేశారు. ఆలయంలో ప్రతీ సోమవారం అన్నప్రసాద వితరణ చేస్తుండటంతో సామగ్రిని అందజేశారు.



అందజేసిన వంటపాత్రలు